నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, గురువారం 2 జనవరి 2025 | RANGAREDDY



మాజీ మంత్రి కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న క్యామ మల్లేశ్

## హ్యాపీ న్యూ ఇయర్

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే సబితారెడ్డిలకు శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ శ్రేణులు**

*నూతన సంవత్సరం సందర్భంగా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావును బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్‌యాదవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవాది, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాంచందర్‌రావు, లీగల్ టీం సభ్యులు, మొయినాబాద్ తదితర మండలాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు కూడా కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపినవారిలో ఉన్నారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డిని బీఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల శ్రేణులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.*

*- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ*



మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు



నూతన సంవత్సర వేళ.. ట్యాంక్‌బండ్‌పై యువత కేరింత

గ్రేటర్‌లో వాణిజ్య సంస్థలు, వ్యాపారస్తులపై జీహెచ్ఎంసీ ఫోకస్ చేసింది. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని టార్గెట్ చేసింది. ప్రాపర్టీ ట్యాక్స్ డేటాబేస్ ఆధారంగా 317033 మంది కమర్షియల్ కేటగిరీలో ఆస్తిపన్ను చెల్లిస్తుండగా, వీరంతా ట్రేడ్ లైసెన్స్‌ల జాబితాలోకి రావాల్సి ఉంది. కానీ కేవలం లక్షా 9వేల 702 మంది మాత్రమే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లిస్తున్నట్లు అధికారులు తేల్చారు. 30 సర్కిళ్లలో ట్రేడ్ లైసెన్స్ లేని వారిని గుర్తించి వారి నుంచి ముక్కుపిండి ఫీజులు వసూలు చేసేలా తాజా కార్యాచరణను సిద్ధం చేశారు. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్లు, ఏఎంఓహెచ్, లైసెన్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ లైసెన్స్ ఆఫీసర్స్, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్స్‌లకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ట్రేడ్ లైసెన్స్‌ల జాబితాలోకి చేర్చాలని కమిషనర్ ఇలంబర్తి ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. సంస్థ ఆదాయాన్ని పెంచుకునే దిశలోనే వ్యాపారస్తులపై స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతుండడం గమనార్హం.

- సిటీబ్యూరో, జనవరి 1 (నమస్తే తెలంగాణ)



# టార్గెట్ వ్యాపారులు!

*ట్రేడ్ లైసెన్స్‌లు లేని వారిపై స్పెషల్ ఫోకస్*

*ఆస్తిపన్ను జాబితా ఆధారంగా రంగంలోకి దిగిన అధికారులు*

*ట్రేడ్ లైసెన్స్ వసూళ్లను పెంచుకోవడమే లక్ష్యంగా చర్యలు*





### సర్కిళ్ల వారీగా తనిఖీలు

జీహెచ్ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లలో నాన్ రెసిడెన్షియల్ పీటీఐఎన్‌ల (ఇంటి నంబర్లు)ను గుర్తించారు. రెండు లక్షల 49వేల 522 వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ జాబితాలో లేరని ఆస్తిపన్ను చెల్లింపుల ద్వారా నిర్ధారించారు. కమర్షియల్ కేటగిరీలో ఆస్తిపన్ను చెల్లిస్తుండగా, వీరంతా ట్రేడ్ లైసెన్స్ జాబితాలో లేరని తేల్చారు. ఈ మేరకు సర్కిళ్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత డీసీ, ఏఎంఓహెచ్, సిబ్బందికి కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. సర్కిళ్ల జాబితా ప్రకారం.. తనిఖీలు చేస్తున్న అధికారులు త్వరలో నివేదిక ఇవ్వనున్నారు. అత్యధికంగా గోషామహల్‌లో 34137 వ్యాపారస్తులు ఉండగా, బేగంపేట 20324, శేరిలింగంపల్లి 17055, చార్మినార్ 15313, ఖైరతాబాద్‌లో 14745 వ్యాపారస్తులు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. వీటితో పాటు మిగతా సర్కిళ్లను పరిశీలిస్తే కాప్రాలో 7853, ఉప్పల్ 5483, హయత్‌నగర్ 6773, ఎల్బీనగర్ 6094, సరూర్‌నగర్ 6893, మలక్‌పేట 6572, సంతోష్‌నగర్ 3022, చాంద్రాయణగుట్ట 2451, ఫలక్‌నుమా 5171, రాజేంద్రనగర్ 5477, మెహిదీపట్నం 8492, కార్వాన్ 4625, గోషామహల్ 34137, ముషీరాబాద్ 6675, అంబర్‌పేట 9750, జూబ్లీహిల్స్ 9815, యూసుఫ్‌గూడ 3209, చందానగర్ 7437, ఆర్‌సీ పురం, రామచంద్రాపురం 2390, మూసాపేటలో 7948, కూకట్‌పల్లిలో 7349, కుత్బుల్లాపూర్ 6653, గాజుల రామారం 4591, అల్వాల్ 4903, మల్కాజిగిరి 5549, సికింద్రాబాద్‌లో 2773ల వ్యాపారస్తులపై సర్వే చేసి కమిషనర్‌కు నివేదిక ఇవ్వనున్నారు.

### లోపాలకు అడ్డు పడేదెన్నడూ?

లైసెన్స్‌ల ఫీజు, వసూళ్ల బాధ్యత, పర్యవేక్షణ, సర్కిల్ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ హెల్త్ (ఏఎంఓహెచ్)లకు అప్పగించగా.. ఇందులో కొందరు, ఏఎంఓహెచ్‌లు అక్రమాలకు తెరలేపారు. లైసెన్స్‌లు లేని వ్యాపారుల నుంచి అందినంత దండుకోవడం, ట్రేడ్ లైసెన్స్‌లు ఇప్పిస్తామని రూ.10వేలు అయ్యే చోట సదరు వ్యాపారస్తుడి నుంచి రూ.60వేలు వసూలు చేస్తున్నారు. ఇటీవల జూబ్లీహిల్స్‌లో ఎస్ఎఫ్ఏలు ఈ అంశాలపైనే ఏసీబీకి చిక్కడం గమనార్హం. అంతేకాకుండా కొన్నిచోట్ల ఫీజు వసూళ్లలో చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. జీహెచ్ఎంసీ వచ్చే ఆదాయాన్ని పక్కదారి పట్టించి ఖజానాకు గండికొడుతున్నారు. వాస్తవంగా 20 ఫీట్ల మేర సింగిల్ లేన్ రోడ్డు ఉంటే చదరపు మీటర్‌కు రూ.3లు, డబుల్ లేన్ రోడ్డు ఉంటే 20 నుంచి 30 ఫీట్ల మేర ఉన్న రోడ్లపై చదరపు ఫీట్‌కు రూ. 4, రెండు లేన్ల కంటే ఎక్కువగా ఉండి 30 ఫీట్లకు మించిన రోడ్లపై చదరపు మీటర్‌కు రూ. 6ల ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు గ్రీనరీ చార్జీలు కూడా చెల్లించాలి. సంబంధిత వ్యాపారి నేరుగా ఆన్‌లైన్‌లో ఈ ఫీజు చెల్లించే వీలు ఉంటుంది. కానీ సర్కిల్‌లోని ఎస్ఎఫ్ఏలు వ్యాపారస్తుల వద్దకు వెళ్లి బేరసారాలు అడుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఉదాహరణకు రూ. లక్ష ఇచ్చే వారి దగ్గర రూ. 50వేల వరకు తీసుకుని వదిలేస్తున్నారు. సదరు వ్యాపారస్తుడి నుంచి వచ్చిన ఫీజు బల్దియా ఖజానాకు చేరడం లేదన్న ఆరోపణలు లేకపోలేదు. ఈ నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో ఒకే చోట తిష్ట వేసిన వారి పట్ల, ఆరోపణలు ఉన్న వారిని, సంస్థాగత లోపాలను సరిదిద్ది ట్రేడ్ లైసెన్స్‌లను గాడిన పెట్టాల్సిన చోట హడావుడి చర్యలకే పరిమితమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఫలితంగానే ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు ప్రతి ఏటా గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయన్న చర్చ జరుగుతున్నది.



కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద పర్యాటకులు

## ‘నూతన’ సందడి

**కోట్‌పల్లి ప్రాజెక్టులో ఉత్సాహంగా పర్యాటకుల బోటింగ్**

**నూతన సంవత్సరం మొదటి రోజు సెలవు దినం కావడంతో భారీగా తరలి వచ్చిన ప్రజలు**

ధారూరు, జనవరి 1 : నూతన సంవత్సరం మొదటి రోజు కార్యాలయాలు, విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. దీన్ని పురస్కరించుకొని ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు పరిసర ప్రాంతాల ప్రజలే కాకుండా హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలి వచ్చారు. ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేసేందుకు ఉత్సాహం చూపించారు. ఆహ్లాదంగా గడిపారు. ఫొటోలు దిగారు. సెల్ఫీలు తీసుకున్నారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి బంధుమిత్రులతో కలిసి వన భోజనాలు చేశారు. ప్రాజెక్టు పరిధిలో ఎలాంటి ఘటనలు జరుగకుండా సీసీ కెమెరాలు, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.




బోటులో షికారు..

## తెగ తాగేశారు..

**రెండు రోజుల్లో రూ.55 కోట్ల మద్యం అమ్మకాలు**

**డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లు నిర్వహించినప్పటికీ తగ్గని జోరు..**



నూతన సంవత్సరం సందర్భంగా రంగారెడ్డిజిల్లాలో గత రెండు రోజుల్లో సుమారు రూ.55 కోట్ల విలువచేసే మద్యం అమ్మకాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. నగర శివారుల్లో విస్తరించి ఉన్న రంగారెడ్డిజిల్లాలో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడాలేని విధంగా మద్యాన్ని విక్రయించారు. జిల్లాలో సరూర్‌నగర్, శంషాబాద్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాలుండగా.. వీటి పరిధిలో వందలాది మద్యం దుకాణాలున్నాయి. వీటిలో మంగళవారం డిసెంబర్ 31 రాత్రితో పాటు జనవరి 1న బుధవారం రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయి. అలాగే, జిల్లా పరిధిలో అత్యధికంగా రిసార్టులు, ఫాంహౌస్‌లుండటంతో పెద్దఎత్తున ఈవెంట్లు కూడా జరిగాయి. దీంతో ఇక్కడ మద్యం వరదలై పారింది. ఎక్కడికక్కడ పోలీసులు డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లు నిర్వహించినప్పటికీ మద్యం అమ్మకాలు తగ్గకపోవడం గమనార్హం.

- రంగారెడ్డి, జనవరి 1 (నమస్తే తెలంగాణ)



### ఫాంహౌస్‌లపై పోలీసుల దాడులు

**● అనుమతి లేని మద్యం, హుక్కా స్వాధీనం**

చేవెళ్ల రూరల్, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా అనుమతులు లేకుండా పార్టీలు నిర్వహిస్తున్న రెండు ఫాంహౌస్‌లపై పోలీసులు దాడులు చేశారు. మద్యం, హుక్కాతోపాటు వాటిని సేవిస్తున్నవారిని అదుపులోకి తీసుకున్నారు. చేవెళ్ల ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. చేవెళ్ల మండల పరిధి ముడిమ్యాల్ గ్రామంలోని జడ్ఎన్ ఫాంహౌస్, మ్యాంగో రిట్రీట్ ఫాంహౌస్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా మంగళవారం రాత్రి న్యూ ఇయర్ పార్టీ నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఈ రెండు ఫాంహౌస్‌లపై దాడులు చేయగా కొందరు వ్యక్తులు మద్యం, హుక్కా సేవిస్తూ కనిపించారు. వెంటనే వాటితో పాటు వీరిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అలాగే అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న డీజే సౌండ్ సిస్టంను కూడా సీజ్ చేశారు. రెండు ఫాంహౌస్‌లు, డీజే యజమానులతో పాటు వీటిని అద్దెను తీసుకున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.